ప్రజాశక్తి

మంగళవారం 29 నవంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అవకతవకల పుట్ట పట్టణ ప్రణాళిక

- 'స్పందన'లో అత్యధికంగా 33 ఫిర్యాదులు
- జివిఎంసి కమిషనర్ కీలక నిర్ణయం
- ప్రతి బుధవారం 'టౌన్‌ప్లానింగ్'పై ప్రత్యేక స్పందన

అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసిలో పట్టణ ప్రణాళిక విభాగం (టౌన్ ప్లానింగ్)ను అవకతవకల పుట్టగా కొత్తగా వచ్చిన కమిషనర్ పి.రాజాబాబు గుర్తించినట్లు స్పష్టంగా వెల్లడైంది. ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమంలో అత్యధికంగా వచ్చే ఫిర్యాదులు వీటికి సంబంధించినవేనని అనతికాలంలోనే ఈ ప్రధాన అధికారి గుర్తించడంతో ప్రతి బుధవారం 'ప్రత్యేక స్పందన'ను పట్టణ ప్రణాళికపై ఏర్పాటు చేస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఇది ఆహ్వానించదగినదే. నగరంలోని పలువురు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. నగరంలోని అన్ని జోన్లలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీకి చెందిన కొంతమంది బడా వ్యక్తులుగా, రూ.కోట్లకు అధిపతులుగా మారడానికి ఈ విభాగమే కీలకంగా ఉంది. కొంతమంది జివిఎంసి అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో ఈ అక్రమ నిర్మాణాలు ఏళ్లతరబడి సాగుతున్నాయి. నగరంలోని జోన్-1, జోన్ -2లలో ఈ అక్రమాలు కోకొల్లలు. ఆయా జోన్లలో ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టి కొందరు రూ.కోట్లకు పడగలెత్తారు. రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, సీతమ్మధార, కొండవాలు ప్రాంతాలన్నింటా ఈ భూ బినామీ భాగోతాలు అనేకం. సోమవారం జివిఎంసిలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 67 ఫిర్యాదులు రాగా ఆయా జోన్లలో అత్యధికంగా 33 టౌన్ ప్లానింగ్‌పైనే వచ్చాయి. ఇంకా పలుదఫాలుగా ప్రజలు, ప్రజాసంఘాల వారు ఈ ఫిర్యాదులు చేసి ఉన్నారు. పరిష్కారం కావడం లేదన్న ఆవేదనతో ముందుకు రావడం లేదు. ప్రభుత్వ భూములు, గెడ్డలు, గోర్జిలు అన్నిటినీ కప్పేసి.. లేదంటే దౌర్జన్యంగా ఆక్రమించి ఫ్లాట్లుగా వేసుకున్నా సరే పట్టణ ప్రణాళిక అధికారులు గుడ్లప్పగించి చూడడమో వారితో కలిసి మెలిసి 'తిలాపాపం తలోపిడికెడు' అన్న చందాన తయారవ్వడమో జరిగింది. సోమవారం గ్రీవెన్స్‌లో 67 ఫిర్యాదుల్లో పరిపాలనా, అకౌంట్స్ హార్టికల్చర్ విభాగానికి 3, రెవెన్యూకు 9, ప్రజారోగ్యానికి 3, టౌన్‌ప్లానింగ్‌కు 33, ఇంజినీరింగ్‌కు 8, యుసిడికి 11 ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిని పరిశీలించి మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ రాజాబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే టౌన్ ప్లానింగ్‌పైనా 'ప్రత్యేక స్పందన' నిర్వహించేందుకు, ప్రతి బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జివిఎంసి సమావేశ మందిరంలో ఈ ఫిర్యాదులు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

గురజాడ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ తదితరులు

చాగంటికి గురజాడ పురస్కారమా ?

రౌండ్ టేబుల్ సమావేశంలో అసమ్మతి తెలిపిన అభ్యుదయ, సాహిత్య, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అభ్యుదయవాదైన గురజాడ పురస్కారాన్ని నిత్యం ప్రవచనాల్లో మూఢనమ్మకాలను ప్రచారం చేసే చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం ఎంత మాత్రమూ తగదని విశాఖలోని అభ్యుదయ, సాహిత్య, ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. తమ అసమ్మతిని తెలియజేస్తూ ఒక అసమ్మతి పత్రాన్ని విడుదల చేసాయి. సోమవారం ఉదయం డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన సాహితీ, అభ్యుదయ సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ చాగంటికి గురజాడ పురస్కారం ఇవ్వడం గాంధీజీ శాంతి బహుమతి నాథూరామ్ గాడ్సేకు ఇవ్వడంతో సమానమని అన్నారు. గురజాడ అభ్యుదయ భావజాలానికీ, చాగంటి కోటేశ్వరరావు ఛాందసవాద ప్రవచనాలకూ ఎటువంటి పొంతనా లేదన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ ఈ చర్య ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదన్నారు. గురజాడ రచనలను పిల్లలు చదువుకునే దశ నుంచే బోధించడం మిగతా 2లో..

రాందేవ్ బాబా, గరికపాటిలను అరెస్టు చేయాలి : ఐద్వా

వార్త మెయిన్‌లో..

'ఉక్కు'పై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి

వార్త 2లో..

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

లోపల పేజీల్లో..



అనకాపల్లిలో చెక్కు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

రైతు సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్ వార్త 2లో..

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో అక్రమాలు

- ఎన్నికల కమిషన్ విచారణ జరపాలి
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో మొదట దశలో నమోదైన ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, నమోదు ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలిపారు. అనర్హులను పథకం ప్రకారం వైసిపి నమోదు చేయించిందన్నారు. ఓటర్ల నమోదులో జరిగిన అక్రమాలపై విచారణ, పరిశీలన ప్రక్రియను ప్రత్యేక ఐఎఎస్ అధికారి ఆధ్వర్యంలో జరిపించాలని కోరారు. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరు నమోదు చివరి రోజున అనగా నవంబర్ 7న ఒక్కరోజులోనే 87 వేల ఓట్లు నమోదయ్యాయని, వీటిపై దృష్టి పెట్టాలని కోరారు. 2 లక్షలా 43 వేలా 903 మంది ఓటర్లుగా నమోదైనట్టు అధికారులు ప్రకటించారన్నారు. అర్హులైన ఓటర్లు వేల సంఖ్యలో నమోదుకు నోచుకోలేదన్నారు. డిగ్రీ అర్హత లేని వారి పేర్లు వేల సంఖ్యలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ లేని వారిని నమోదు చేశారన్నారు. పదో తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్ సర్టిఫికెట్లు కలిగిన వారిని కూడా ఓటర్లుగా చేర్పించారన్నారు. 2019 మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో అక్రమాలు

అక్టోబర్ 30 తర్వాత అనగా 2020, 2021 2022 సంవత్సరాలలో డిగ్రీ పాసైన వారిని కూడా ఓటర్లుగా నమోదు చేశారన్నారు. ఇటువంటి వారు వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. అంతేగాకుండా ఒక వ్యక్తి 2 నుంచి 5 సార్లు ఓటరు జాబితాలో నమోదయ్యారన్నారు. ప్రతి బూతులో ఇటువంటివి 50 నుంచి 80 వరకు ఉన్నాయని తెలిపారు. ఇదంతా ఒక పథకం ప్రకారం కుట్రతో జరిగిందన్నారు. అన్ని అర్హతలూ ఉండి గెజిటెడ్ సంతకంతో ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని ఎటువంటి పరిశీలనా జరగకుండానే తొలగించారన్నారు. డిజిగ్నేటెడ్ ఆఫీసర్ దరఖాస్తు పరిశీలించి, ఎక్నాలెడ్జిమెంట్ కార్డు ఇచ్చినా నమోదు చేయలేదన్నారు. విశాఖ జిల్లాలో వేల సంఖ్యలో అర్హత ఉన్న వారి దరఖాస్తులను దురుద్దేశంతోనే నమోదు చేయలేదన్నారు. తిరస్కరించబడిన వారి వివరాలతో కూడిన ఓటరు జాబితాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల అభ్యంతరాలు చెప్పడానికి, తిరిగి నమోదు చేసుకోవడానికి మార్గం సులభతరమ వుతుందన్నారు. ఓటర్ల అప్లికేషన్లు, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు ఏ సంవత్సరంలో డిగ్రీ పాసయ్యారో తెలిపే వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ఎక్సెల్ ఫార్మెట్లో పెట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైన ఎక్కువ దరఖాస్తులను బిఎల్‌ఒలు వైసిపి నాయకుల ఒత్తిడితో వెరిఫికేషన్ చేయలేదన్నారు. ఓటర్ల నమోదులో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. శాసన మండలిలో ప్రజా ప్రయోజనాలపై మరింత పోరాటం చేసే అవకాశముంటుందని తెలిపారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, డాక్టర్ బి.గంగారావు, కెఎం.శ్రీనివాస్, బి.జగన్ పాల్గొన్నారు.

చాగంటికి గురజాడ పురస్కారమా ?

ద్వారా భవిష్యత్తు తరాల వారిలో అభ్యుదయ భావాలు పెంపొందించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గురజాడ పురస్కారాన్ని చాగంటికి ఇవ్వడం సమాజాన్ని వందేళ్ల వెనక్కు తీసుకెళ్లినట్టువుతోందన్నారు. చాపకింద నీరులా ఛాందసవాదం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పురస్కారం అందజేసే కమిటీవారు తమ తిరోగమన నిర్ణయాన్ని పున : పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి పి.రామారావు, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మిత్ర సాహితీ కన్వీనర్ వర్మ, విశాఖ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అడపా రామకృష్ణ, సాహిత్య సురభి వ్యవస్థాపక అధ్యక్షులు కల్యాణ రామారావు, అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రతినిధి రాజేశ్వరరావు, పిఎన్‌ఎం జిల్లా అధ్యక్షులు జి.రమణ, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రియాంక, ఎపి పిఎన్‌ఎం జిల్లా అధ్యక్షులు చిరంజీవి, అరుణోదయ జిల్లా నాయకులు నిర్మల, పీపుల్ ఫర్ ఇండియా కన్వీనర్ కామేశ్వరి, గ్రంథాలయ పరిరక్షణ సంస్థ కార్యదర్శి బిఎల్.నారాయణ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు బిబి.గణేష్, జెవివి నాయకులు శేషగిరిరావు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అటవీ శాఖకు చెందిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ స్పందనలో ఆయన వినతిపత్రం సమర్పించారు. విశాఖ నగరంలోని అటవీ శాఖకు చెందిన వందల కోట్ల విలువైన భూములపై బడాబాబులు కన్నుపడిందన్నారు. ఆ క్రమంలోనే అధికార పార్టీ ముఖ్య నేతల అండతో ఆ భూముల్లో ఆకస్మాత్తుగా సర్వే సాగిన తీరుపై అన్ని ప్రధాన వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్, క్షేత్రపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

30న కెఎన్‌ఆర్ ట్రస్టు వార్షికోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెఎన్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలు, ట్రస్టు చైర్మన్ కందుల నాగరాజు జన్మదిన వేడుకలను ఈ నెల 30వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ కందుల నాగరాజు వార్డు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా దశాబ్దాల కాలంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ ఏడాది వార్షికోత్సవం సందర్భంగా పది వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. సమావేశంలో వైజాగ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

డిసిపి - 2గా ఆనందరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ డిసిపి-2గా కె.ఆనందరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌బి అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న ఆయన్ని నాన్ క్యాడర్ ఎస్‌పిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గాజువాక కేంద్రంగా ఉన్న డిసిపి - 2 పోస్టు రెండేళ్లగా ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం ఆ బాధ్యతలను ఆనందరెడ్డికి అప్పగించింది. ఆయన్ని పలువురు సోమవారం అభినందించారు.

ఆనందరెడ్డిని అభినందిస్తున్న సిపి శ్రీకాంత్

రైతు సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - అనకాపల్లి : రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. స్థానిక గుండాల వీధి సచివాలయంలో సోమవారం జిల్లాకు మంజూరైన 44 లక్షలా 503 రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీ, రూ.6 కోట్లా 91 లక్షల సున్నా వడ్డీ మొత్తాన్ని ఎంపీ డాక్టర్ సత్యవతి, కలెక్టర్ రవి పఠాన్‌శెట్టితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు ముంగిటికే వ్యవసాయానికి కావలసిన సామాగ్రిని అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 994 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ, 36 వేల 078 మందికి సున్నా వడ్డీ రాయితీలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ చిక్కాల రామారావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పలక యశోద, జిల్లా వ్యవసాయ అధికారి లీలావతి, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎంపిపి గొర్లి సూరిబాబు, మళ్ల బుల్లి బాబు, జాజుల రమేష్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్‌లో చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, పలువురు ప్రజాప్రతినిధులు

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా వ్యాప్తంగా 2132 మంది రైతు కుటుంబాలకు రబీ 2020-21, ఖరీఫ్ 2021కు సంబంధించి సున్నా వడ్డీ రాయితీ కింద రూ.42 లక్షలు, పంట నష్ట పరిహారం కింద ఖరీఫ్ 2021కి సంబంధించి 151 మంది రైతులకు రూ. 6.28 లక్షలు మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి పాల్గొన్నారు.

'ఉక్కు'పై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం : డిసెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను కేంద్రం ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 655వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, గంధం వెంకటరావు, డివి.రమణారెడ్డి మాట్లాడుతూ ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయడానికి ముడి సరుకుల నిల్వలు పెంచాలని కోరారు. విశాఖ ఉక్కు కార్మిక వర్గానికి 2017 వేతన సవరణను సెయిల్ మాదిరి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు..కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఉక్కు ఉద్యమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. దీక్షల్లో కారు రమణ, శ్రీనివాస నాయుడు, సన్యాసిరావు, కృష్ణారావు, గుమ్మడి నరేంద్ర, కె.రాజబాబు, డి.శ్రీనివాస్, టి.భాస్కర్, ఎస్.పాపారావు, ఎమ్.త్రిమూర్తులు, కాశీ రమణ, రామారావు, ఈశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

606వ రోజుకు జెఎసి దీక్షలు

కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను భేషరతుగా విడనాడాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నాయకులు ఈసర లక్ష్మి, కె.జయమ్మ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారానికి 606వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. నిర్వాసితులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. మిగులు భూములను నిర్వాసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం మార్చుకోకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో బి.కళావతి, ఎ.దాలమ్మ, ఆర్.కల్పన, ఎన్.లక్ష్మి, ఆర్.కనక, ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలకు ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిబిసిఎంసికి చెందిన 18,390 గజాల స్థలం, సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 3600 గజాల స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, ఈ స్థలాల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట జనసేన పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, వైజాగ్ స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జీవీ కలిసి సిబిసిఎన్‌సి, సోషల్ వెల్ఫేర్ స్థలాలను కాజేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తక్షణమే టిడిఆర్ రద్దుచేసి, అక్రమార్కులకు సహకరించిన కమిషనర్ రాజాబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస పట్నాయక్, శివప్రసాద్, రామకృష్ణ, కృష్ణ, రవి, రూప, శ్రావణి పాల్గొన్నారు.

జెసికి ఫిర్యాదు

సాంఘిక సంక్షేమ శాఖకు జిఒ 99/2009 ద్వారా గతంలో కేటాయించిన 3500 చదరపు గజాల భూమిని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారులుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు శిక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎపి కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తరగతులు మొదలవుతాయని పేర్కొన్నారు. యువత నుంచి ఎలాంటి లాభాపేక్షా లేకుండా సేవాదృక్పథంతో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టులను బోధిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమాచారం పొందవచ్చని, మరిన్ని వివరాలకు 9315014015 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సిఎఫ్‌టియుఐ డొమెస్టిక్ వర్కర్స్ ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.లక్ష్మి, జి.వెంకటలక్ష్మి, జి.బాలభాను మాట్లాడుతూ గృహ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పది సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూ విన్నపాలు, విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గృహ కార్మికులకు సమగ్ర చట్టం లేనందున దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వెలుబుచ్చారు. వారందరికీ ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని, అర్హులకు ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ సంబంధ పనులు చేసే వారందరినీ రిజిస్టర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటలక్ష్మి, డి.సురేష్ బాబు, లండా ఎర్రమ్మ, మైలపల్లి మోహిని, బి.మౌనిక, బి.మాణిక్యం, జి.కనకమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -తగరపువలస: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల దృష్ట్యా చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 29, మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ బి.రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, సంగివలస, వలందపేట, చిట్టివలస, చిల్లపేట, తగరపువలస, జీరుపేట, బాలాజీనగర్, అవంతి కళాశాల, టి నగరపాలెం, తాటితూరు, మజ్జివలస, లక్ష్మీపురం, సింగనబంద, విజయరాంపురం, కృష్ణంరాజుపేట, మద్దిలపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బస్‌షెల్టర్ ప్రారంభం

బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న ఆనందకుమార్

ప్రజాశక్తి - ములగాడ: కోరమండల్ ఫెర్టిలైజర్స్ సౌజన్యంతో శ్రీహరిపురంలో నిర్మించిన బస్‌షెల్టర్‌ను వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ పివి.సురేష్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు, తర్వాత 59, 60వార్డుల్లో నాడునేడు అభివృద్ధి పనులు, సిసిరోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 61 వార్డు కార్పొరేటర్ కొణతాల సుధా, కోరమండల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కె. రంగకుమార్, జీవిఎస్ రాజా, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు రేవల్లు సత్యనారాయణ, పిలకా రామ్మోహన్ పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- సింహాచలం: చెత్త సేకరణ, తరలింపులో నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని జివిఎంసి అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు హెచ్చరించారు. సోమవారం 98వ వార్డు ప్రియ గార్డెన్స్ ప్రాంతంలో జోనల్ కమిషనర్ మల్లునాయుడు, వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహంతో కలిసి విస్తృతంగా పర్యటించారు. వార్డుల్లో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎడిసి సన్యాసిరావు మాట్లాడుతూ తడిపొడి చెత్త వ్యాను ప్రతిరోజూ మూడు ట్రిప్పులు తిప్పాలని ఆదేశించారు. పారిశుధ్యం మెరుగునకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. వార్డుల్లో అపరిష్కృత సమస్యలను కార్పొరేటర్ పి.వి.నరసింహం ఎడిసి దృష్టికి తేగా, పరిష్కారానికి హామీనిచ్చారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, టిడిపి వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు పాల్గొన్నారు..

ఉద్యోగాల పేరుతో మోసం

- ఆరుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికి పలువురి నుంచి రూ. 75 లక్షలు వసూలు చేసి, మోసగించిన వ్యక్తులను ఆరిలోవ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సోమవారం ఆరిలోవ సిఐ ఇమ్మాన్యుయేల్ రాజు చెప్పిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బలివాడ పద్మజ, తన భర్త పలుకుబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను నమ్మబలికి మోసపుచ్చిందని ఆరిలోవ, టిబిసి పాయింట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అన్వర్ వల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారని సిఐ తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు నిర్వహించి, బలివాడ పద్మజతోపాటు ఆమెకు సహకరించిన ఆరిలోవ, టిబిసి పాయింట్‌కు చెందిన సిరిపురపు జాన్ నిరంజన్, విశాఖ నగరానికి చెందిన గుడాల స్వరూపాజాన్, తగరపువలసకు చెందిన ఈటి దేవిరావు, రామాటాకీస్, తులసి పేట ప్రాంతానికి చెందిన మద్దిల నవీన్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వసూలు చేసిన డబ్బులను పద్మజ నుంచి ఇప్పిస్తానని బాధితులకు నమ్మబలికిన . ఆరిలోవ ప్రాంతానికి చెందిన ధూళి రఘును కేసులో నిందితుడిగా చేర్చి, స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశామన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

ప్రజాశక్తి -కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పూలమాల వేసి నివాళు లర్పించారు. జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్ఒ శ్రీనివాస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ పార్క్ హోటల్ జంక్షన్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తన అనుచరులతో వచ్చి జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలోనూ కార్యక్రమం జరిగింది. వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పూలేకు ఘన నివాళ్లర్పించారు.

ఇపిడిసిఎల్‌లో..

కుల వ్యవస్థ నిర్మూలన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఎపిఇపిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా సంస్థ ఉద్యోగులు సోమవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు సి.శ్రీనివాసమూర్తి, ఎం.సుమన్ కళ్యాణి, బి.రామచంద్ర ప్రసాద్, ఎస్.మసిలామని, జె.శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక వైసిపి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని పూలే చిత్రపటానికి 3వ వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగరావు అధ్యక్షతన వార్డు ప్రధాన కార్యదర్శి పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, ఉపాధ్యక్షులు బి.రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణ రావు, నాయకులు జీరు వెంకటరెడ్డి, ఆర్ ప్రభాకర నాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాఖపట్నం : వైసిపి తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఎపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పారావు, 18వవార్డు ఇన్‌ఛార్జి పుక్కళ్ల ధనలక్ష్మి శంకర్, 15,16వ వార్డుల అధ్యక్షులు అప్పారి గిరిబాబు, చొల్లంగి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, ఉమ్మిడి కళ్యాణ్, మద్ది పోలరెడ్డి, మీసాల ప్రదీప్ పాల్గొన్నారు.

కరాస : మర్రిపాలెంలోని 52వ వార్డు వైసిపి కార్యాలయంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో స్థాయి సంఘం సభ్యులు పివి. సురేష్, జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు.

పెందుర్తి : 96, 97వార్డుల్లోని పలు ప్రాంతాల్లో జ్యోతిబా పూలే చిత్రపటాలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. 95వ వార్డు కార్పొరేటర్ మువ్వల దేముడు, ఆదిరెడ్డి మురళి, గొర్లి రాముునాయుడు, ఎంపిపి నాగమణి అంజి, వైస్ ఎంపిపి చిరికి దేవుడు, అంగటి సూరిబాబు, రాపర్తి మాధవరావు, రాపర్తి కష్ణమోహన్, కంచిబోయిన సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

'ఆదర్శ' విద్యార్థుల గ్రామీణ సందర్శన

ప్రజాశక్తి- పెందుర్తి :నూతన విద్యా విధానం మార్గదర్శకాల ప్రకారం కోకరికులర్ యాక్టివిటీస్‌లో భాగంగా ఆదర్శ డిగ్రీ కాలేజీ విద్యార్థులు సోమవారం లంకవానిపాలెంలో చారిత్రక గ్రామీణ సందర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్ఇ ఫ్లోరా ఆధ్వర్యంలో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాల పరిణామక్రమంపై అధ్యయనం చేశారు. హిస్టరీ లెక్చరర్ డి.సింహాచలం ఆధ్వర్యంలో బిఎ డిగ్రీ విద్యార్థులు పరిపాలనా, రెవెన్యూ పన్నులు, సంస్కృతి, ప్రాచీన ఆచారాలు, సాంప్రదాయాలపై పరిశోధించారు. ఆదర్శ డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి. థియోఫిలస్ వైస్ ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాస్ , బల్బాన్ రవిబాబు పాల్గొన్నారు.

పాముల బెడద నివారణకు చర్యలు

ప్రజాశక్తి- ములగాడ : 59వ వార్డు, తహశీల్దార్ కార్యాలయం రిచ్ ఎన్‌జివోస్ కాలనీలో పందులు, పాములు బెడదతో స్థానికులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు చేపడతామని జివిఎంసి సిఎంహెచ్ఒ శాస్త్రి హామీనిచ్చారు. స్థానికుల ఇబ్బందులను కార్పొరేట పుర్రె పూర్ణశ్రీ, వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సూచనల సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఉన్న చెట్లను, గోడను తీయించి, సమస్య పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. స్నేక్ క్యాచర్ కిరణ్,శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సునీల్, అడ్మిన్ సుదీప్తి, రేవల్ల సత్యనారాయణ, కాలనీ ప్రెసిడెంట్ దుర్గారావు, రాజు, జిలాని, గిరి పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -తగరపువలస :వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో ఆర్‌టిసి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని భీమిలి ఒకటో జోన్ కమిషనర్ ఎస్.వెంకటరమణకు సోమ వారం జాతీయ మానవ హక్కుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు శీరపు రామలక్ష్మి స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. బస్‌షెల్టర్ లేక పోవడంతో ప్రజలు, ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారని కార్యక్రమంలో కవిత, వెంకటేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు

వైభవంగా ఆలయ రజతోత్సవం

ప్రజాశక్తి -కరాస: విశాఖ ఎన్ఎడి జంక్షన్ దరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ రజతోత్సవం సందర్భంగా మహా కుంభాభిషేకం, సుబ్రహ్మణ్య రజతోత్సవ షష్ఠి కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి హారతులిచ్చారు. కార్యక్రమంలో విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వెదుళ్ల శ్రీను, సీనియర్ న్యాయవాది రాంజీ, విజయ్‌కుమార్, వెంకటరమణ, గొంతెన రామకృష్ణ పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజక వర్గంలోని 24వవార్డులో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర ఛైర్మన్ కెకె.రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు క్రాంతినగర్‌లో రూ.12లక్షలతో సిసి, బిటి రోడ్లు నిర్మాణం, వార్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా 19.40లక్షలతో టిపిటి కాలనీలో బృందావనం పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుంటూరు భారతి, ఎఇ శ్రీరామ్ మూర్తి, ప్రసన్న, బందావనం పార్క్ కమిటీ సభ్యులు, గ్రామ,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

అప్పన్న సన్నిధిలో డిసిపి ఆనందరెడ్డి

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను డిసిపి ఆనందరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు.

వేలం పాటల ద్వారా రూ.5.62 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో సోమవారం 12 అంశాలకు సంబంధించి నెలరోజులకు నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ5,62,050 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. వేలం పాటలో ఎఇఒ. జంగం శ్రీనివాసరావు, సూపరెంటిండెంట్ నిద్దం నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అదుపు తప్పిన బైక్, మృతుడు నర్సింహులు(ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలివి. విశాఖపట్నం పూర్ణ మార్కెట్‌కు చెందిన కలగర్ల నరసింహులు (55) ఆదివారం విజయనగరం జిల్లా, గుర్ల మండలం పెద్ద బంటుపల్లి గ్రామానికి తమ్ముడు భవాని అంబలపూజకు వంటలు చేసేందుకు వెళ్ళి, తిరుగు ప్రయాణంలో స్కూటీపై వస్తుండగా పెద్దిపాలెం బ్రిడ్జిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో తలకు గాయమై సంఘటనాస్థలిలోనే మృతి చెందాడు. వెనుకనున్న వంట సహాయకుడు నాగులమీరాకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనపై ఎస్ఐ శ్యామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు పోస్టుమార్టానికి తరలించారు.

సింహాచలం ఘాట్‌రోడ్డులో ప్రమాదం

- అదుపు తప్పి లోయలో పడిన బైక్

- దంపతులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం ఘాట్‌రోడ్డులో జరిగిన బైక్ ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. సింహాద్రి అప్పన్న దర్శనానికి సీతంపేటకు చెందిన వి కాశిబాబు, అతని భార్య అమ్మాజీ, మనవరాలు జ్ఞానేశ్వరి, స్వామి దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో బైక్‌పై వస్తుండగా, ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంతో కాశిబాబు తలకు తీవ్రగాయంకాగా, అమ్మాజీకి కాలు విరిగిపోయింది. లోయలోకాకుండా రోడ్డుపైనే పడిన జ్ఞానేశ్వరికి స్వల్పగాయాలయ్యాయి. వెనుకనే వస్తున్న బాధితుల కుటుంబసభ్యులు వెంటనే దేవస్థానం సిబ్బంది సహకారంతో లోయలో పడిన దంపతులను బయటకు తీసి, సింహాచలం గ్రామీణ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే దేవస్థానం ఇన్‌ఛార్జి ఇఒ వి.త్రినాథరావు, ఇతర సిబ్బంది ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు.

బైకు అదుపు తప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని రాజగోపాల్ పురం గ్రామానికి చెందిన బత్తిని వీరేంద్ర (22) బైక్‌పై వెళుతూ కుక్కను ఢీకొట్టడంతో అదుపు తప్పి బలమైన గాయాలు కావడంతో సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు ఎస్.నరసాపురం కోళ్ల ఫారం దగ్గర రోడ్డు దాటుతుండగా, కుక్క అడ్డుగా రావడంతో వాహనాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకుపోయి కింద పడడంతో వీరేంద్రకు తీవ్రగాయాలై, మృత్యువాత పడ్డాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పాలిన అప్పలరాజు తెలిపారు.

12 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో బిబి.పట్నం గ్రామంలో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 12 కేజీల గంజాయిని పట్టుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగకార్తీక్ తెలిపారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి- చీడికాడ: చిన గోగాడ గ్రామానికి చెందిన అదట్రావు అప్పారావు కుమార్తె మాధవి (15) ఆదివారం అదృశ్యమైంది. వరహాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలిక ఆదివారం సాయంత్రం నుండి కనిపించ లేదని తండ్రి అప్పారావు చీడికాడ పోలీస్‌స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

మెకానిక్‌లకు గుర్తింపు కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణుమూర్తి

ప్రజాశక్తి-గాజువాక : వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలిగి, వారి బైక్‌ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పారి విష్ణుమూర్తి సూచించారు. సోమవారం గాజువాక ప్రగతి టూవీలర్ మెకానిజం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని, మెకానిక్‌లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ, మెకానిక్‌లంతా క్రమశిక్షణతో మెలగాలని, మెకానిక్ షాపులో రిపేర్లకు వచ్చిన వాహనాలకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించి, వినియోగదారులు చెప్పే సమస్యలను నమోదుచేసి, రిపేర్లు చేసి ఇవ్వాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే టెస్ట్‌రైడ్‌కు ఇవ్వరాదన్నారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు జి.దామోదరావు, ఉపాధ్యక్షులు వంగపండు గణేష్, కోశాధికారి రెడ్డిపల్లి రాజు, సహాయ కార్యదర్శి సమ్మిడి పైడిరాజు, మెకానిక్‌లు పాల్గొన్నారు

ఎయిడ్స్‌పై వ్యాసరచన పోటీలు

వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న డాక్టర్ మురళీ మోహన్

ప్రజాశక్తి - విశాఖపట్నం: పెద్ద వాల్తేరులోని శాంతి ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహనకువ్యాస్య రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ మాట్లాడుతూ డిసెంబర్ ఒకటిన ప్రపంచ ఎయిడ్స నిర్మూలన దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి డివి.రెడ్డి, హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటుకు వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలం దబ్బందలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సోమవారం ఎంపిపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపితండ్రి మజ్జి వెంకటరావు మాట్లాడుతూ దబ్బంద పరిసర గ్రామాలలో సెల్ టవర్ లేక ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసరానికి అంబులెన్స్‌కు ఫోను చేయాలన్నా వీలులేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సిఫార్సు మేరకు బిఎస్ఎన్ఎల్ అధికారులు వచ్చి స్థల పరిశీలన చేసి వెళ్లారేగానీ, ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, త్వరలోనే దబ్బందలో సెల్‌టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డోల దేవుడు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు,డైరెక్టర్ రౌతు శ్రీను, వైసిపి నేతలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయం

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజబాబు, టిడిపి నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని, దీన్ని ఏ ఒక్కరూ ఆపలేరని టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై టిడిపి ఆధ్వర్యాన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' పేరిట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని చిట్టివలస శ్రీలక్ష్మీ శ్రీనివాస కల్యాణమండపంలో సోమవారం నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటానూకరాజు, జివిఎంసి ఒకటో జోన్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం,మధురవాడ ప్రాంత నాయకులు బడిగింటి నీలకంఠం, పిట్ట సురేష్, మొల్లి లక్ష్మణరావు, కె.దామోదరరావు, వానపల్లి సత్య, కె.లీలావతి, బోయి రమాదేవి పాల్గొన్నారు.ముందుగా మహాత్మా జ్యోతీబా పూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

అనధికార షెడ్ తొలగింపు

సామగ్రిని పట్టుకెళ్ళిన దేవస్థాన సిబ్బంది

ప్రజాశక్తి-పెందుర్తి : సింహాచలం దేవస్థానం స్థలంలో అనధికారికంగా నిర్మించిన షెడ్‌ను సోమవారం దేవస్థానం అధికారులు తొలగించారు. 95వ వార్డు కృష్ణరాయపురం వద్ద ఒక టింబర్ డిపోలో అనధికారంగా రాత్రికిరాత్రే షెడ్ వేశారని సమాచారం అందిందని, ఈ మేరకు పరిశీలించి తొలగిస్తున్నట్లు ఎఇఒ ఆనందకుమార్ వెల్లడించారు. దేవస్థాన స్థలాలను ఎవరు ఆక్రమించి ఉపేక్షించబోమని, ఎంతటి వారైనా అక్రమ నిర్మాణాలను తొలగించడం తోపాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా సర్వే నెంబరు 20లోని స్థలాన్ని తాము కొనుగోలు చేశామని, ఇపుడు దాన్ని దేవస్తానం స్థలమంటూ తొలగించడం దారుణమని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ స్థలానికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అంటున్నారు.

లెక్క కుదరనందువల్లే...

టింబర్ డిపో వద్ద మూడేళ్ల క్రితమే షెడ్ నిర్మాణానికి పూనుకున్నారని, ఇన్నాళ్లు చూసీచూడనట్లు వ్యవహరించిన దేవస్థానం అధికారులు హఠాత్తుగా షెడ్ తొలగించడం వెనుక లెక్కకుదరకే ఇదంతా అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. దేవస్థానం స్థలాల్లో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు ఎన్నో వెలిశాయని, వాటన్నింటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అంటున్నారు. దేవస్థానం అధికారులను ప్రసన్నం చేసుకుంటే అక్రమమైనా, సక్రమమైపోతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

అపరిశుభ్రతకు నెలవు హాస్టల్ పరిసరాలు

ప్రజాశక్తి -మధురవాడ : ఏడోవార్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహం-1 అపరిశుభ్రతకు నెలవుగా ఉందని పౌర సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్, ఇతర సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ ఆవరణలోని అపరిశుభ్ర వాతావరణం, దుర్వాసన, పందుల స్వైరవిహారం పరిస్థితులను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

హాస్టల్‌కు సరైన డ్రైనేజీ, ప్రహరీ లేకపోవడంతో మురుగునీటి గుంటలతో, చెత్తాచెదారంతో డంపింగ్‌యార్డును తలపిస్తోందని, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. హాస్టల్‌లోనూ భోజనం నాణ్యత లేక తినలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు.దీనిపై సంబంధిత అధికారులు, నేతలు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పౌరసంక్షేమసంఘం ప్రతినిధులు భరోసానిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రదీప్, జగన్మోహన చౌదరి, పోలిశెట్టి నాగేశ్వరరావు, మోహనరావు, నూకవరపు బాబ్జి, ఆశా స్వరూప్, ఆశాజ్యోతి, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

విడిఎ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ఆకాశవాణి కార్యక్రమంలో పాల్గొన్న విడిఎ విద్యార్థులు

ప్రజాశక్తి- గాజువాక : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆల్ ఇండియా రేడియో నిర్వహించిన పాటలు, పద్యాల కార్యక్రమంలో స్థానిక విశాఖ డిఫెన్స్ అకాడమీ (విడిఎ) డిగ్రీ కాలేజీ విద్యార్థులను మంచి ప్రతిభ కనబరిచారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల గొప్పతనాన్ని భావితరాలకు పాటలు, పద్యాలు రూపంలో వివరిస్తూ ఒక కార్యక్రమాన్ని రూపొందించారు. వచ్చేనెల 4న సాయంత్రం ఐదు గంటలకు ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి)లో ఈ కార్యక్రమం ప్రసారం జరుగుతుందని కాలేజీ వర్గాలు తెలిపాయి. ఆకాశవాణి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కాలేజీ యాజమాన్యం ప్రతినిధులు బండి శ్రీనివాసరావు, డిఎస్ఎస్.కృష్ణకుమార్, ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, ఇతర సిబ్బంది అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి,-ఆనందపురం : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల 1994-95 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మండలంలోని గుడిలోవలో సోమవారం జరిగింది. దాదాపు 27ఏళ్లలోపు కలుసుకున్న వారంతా ఆప్యాయంగా పలకరించుకుని, గత స్మృతులను నెమరువేసుకున్నారు.

తరచూ కలుసుకోవాలని, ఉమ్మడిగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కోరాడ ఆదినారాయణ, రాము, శ్రీను, మంగరాజు, బంకురాజు, చిన్నారావు, గణేష్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు

ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై 3, 4, 5 తేదీల్లో సదస్సు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై వచ్చేనెల 3,4,5 తేదీల్లో గుంటూరు లాంఫాంలో సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ తెలిపారు. ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలనిడివిజన్ పరిధిలోని అభ్యుదయ రైతులకు సూచించారు . నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు ఈ సదస్సు దోహద పడుతుందన్నారు.

కౌశల్ పోటీల్లో దీపిక ప్రతిభ

దీపికను అభినందిస్తున్న హెచ్‌ఎం మురళీ మోహనరావు

ప్రజాశక్తి -తగరపువలస : భారతీయ విజ్ఞానమండలి, ఎపి శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎ.దీపికను సోమవారం పాఠశాలలో అభినందించారు. కౌశల్ క్విజ్ పోటీల్లో పోస్టల్ ప్రెజెంటేషన్‌లో గెలుపొందిన దీపికను హెచ్‌ఎం పొట్నూరు మురళీ మోహనరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు కృషి

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మాలినాయుడు

ప్రజాశక్తి -ములగాడ :టిడిపి వ్యవస్థాపకుడు ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ 62వ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం దుర్గానగర్ టిడిపి కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జివిఎంసి ప్రాథమిక పాఠశాలలోని 280మంది విద్యార్థులకు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో డొప్పు సన్యాసిరావు, నీలాపు జోజి, కోరుబిల్లి రాము, గంగాధర్, నర్సింగరావు, చంద్రశేఖర్, రాము, దుర్గ, త్రినాథ్, తాని సూరిబాబు, మురళి, నాగరాజు, చండి, హరిహరరాజు, గొలగాని అప్పారావు పాల్గొన్నారు,

స్పందనలో ఆరు వినతులు

వినతులు స్వీకరిస్తున్న జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ

ప్రజాశక్తి- విశాఖపట్నం : జ్ఞానాపురం కూడలిలోని జివిఎంసి ఐదోజోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఐదు వినతులు వచ్చాయని జెడ్‌సి ఆర్‌జివి.కృష్ణ తెలిపారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యుసిడికి సంబంధించి రెండేసి ఫిర్యాదులు వచ్చాయని, వాటి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు

నేవీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం మండల కార్యదర్శి దేవుడునాయుడు

ప్రజాశక్తి- రాంబిల్లి

నేవీ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు డిమాండ్ చేశారు. నేవీ గేట్ ముందు నేవల్ బేస్ నిర్వాసితులు ఎనిమిది గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన సోమవారం నాటికి 29వ రోజుకి చేరుకుంది. ఇందులో పాల్గొన్న దేవుడునాయుడు మాట్లాడుతూ నేవీ వల్ల సర్వం కోల్పోయిన నిర్వాసితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, జీవన భృతి చెల్లించాలని, పెండింగ్ ప్యాకేజీలు అందజేయాలని డిమాండ్ చేశారు. చేపలు వేటకు అనుకూలంగా జెట్టీ నిర్మించాలని, నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, ఆధార్ కార్డు ఆధారంగానే శారద, వరాహ నదుల్లో చేపలు వేటకు పంపాలని కోరారు. 17 సంవత్సరాలుగా నేవీ నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాలు జేఏసీ పెద్దలు, వేలాదిమంది నిర్వాసితులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న నేవీ నిర్వాసితులు

పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

డెయినేజీ నిర్మాణానికి రూ.40 లక్షలు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని ఊడేరు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కాలువల ఆక్రమణలు తొలగించి తక్షణమే పనులు చేపట్టాలన్నారు. సోమవారం ఆయన ఊడేరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎం.సత్యారావు లారస్ కంపెనీలో పని చేస్తూ ప్రమాదానికి గురై కాలు విరిగి ఏడాదిన్నర కాలంగా ఇంట్లోనే ఉన్నట్లు తెలియజేయడంతో మంత్రి స్పందించారు. కాలు బాగయ్యేందుకు సహాయ సహకారాలు అందిస్తానని, లారస్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తిరిగి విధుల్లో చేర్చుకొనేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నాడు-నేడు కింద రూ.13 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు, మళ్ల బుల్లి బాబు, పలక రవి, మలసాల కిషోర్, సర్పంచ్ సిరిగిరిశెట్టి కృష్ణ మోహన్, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దాడ అచ్చయ్యమ్మ, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, తహశీల్దారు గంగాధర్, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మల్లం గ్రామంలో...

బుచ్చయ్యపేట : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని మల్లం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి స్థానికుల నుంచి వినతుల స్వీకరించారు. కార్యక్రమంలో వైసిసి మండల అధ్యక్షులు కొల్లి మల్లనాయుడు, నాయకులు దాకారపు నాగరాజు స్థానిక సర్పంచ్ బర్ల శివ, మాజీ సర్పంచ్ సుంకర సత్యారావు, ఎంపీడీవో సువర్ణ రాజు, తహసిల్దార్ అంబేద్కర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

ఘనంగా 'శివ శివాని' క్రీడా వార్షికోత్సవం

ప్రజాశక్తి - పరవాడ : శివ శివాని పబ్లిక్ స్కూల్ 29వ క్రీడా వార్షికోత్సవం స్థానిక ఉక్కునగరంలోని పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం స్కూల్ జనరల్ సెక్రెటరీ సుధీర్ కుమార్ సంపతి ప్రారంభించారు. ఈ పోటీలలో పిపి 1, పిపి 2 బాలికలు 25 మీటర్ల పరుగు పందాలలో పాల్గొని అలరించారు. ఫ్యాన్సీ రేస్ 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో గెలిచిన విద్యార్థులకు స్కూల్ కస్పాండెంట్ ఉష ఎస్.సంపతి బహుమతులను అందజేశారు. బాలుర విభాగంలో షేక్ ఉమర్ షారుక్, బాలికల విభాగంలో నవ్యశ్రీ ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నారు. ప్రథమ స్థానంలో హర్ష హౌస్, ద్వితీయ్ స్థానంలో సిద్ధార్థ హౌస్ నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ అకానామిక్ కెవి.రమణి, వైస్ ప్రిన్సిపల్ సాక్షి సంపతి, హెచ్ఎం శైలజ సోహన్, వి.శ్రీనివాస్, పిఇటి ఖాదర్ జిలాని, ప్రసాద్, అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న బుధవారం ఉదయం11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పవన్ కల్యాణ్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి- చోడవరం : నియోజకవర్గ సమస్యలను జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు వివరించినట్లు ఆ పార్టీ చోడవరం నియోజకవర్గం నాయకులు సిరిపురం రమేష్ తెలిపారు. సోమవారం పవన్ కళ్యాణ్‌ను కలిసినట్లు ఆయన వెల్లడించారు. జగనన్న కాలనీలో నిర్మాణాలు నత్త నడకన జరుగుతున్నాయని, రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉందని, నియోజకవర్గంలో ఇటువంటి అభివృద్ధి జరగలేదని పవన్ కళ్యాణ్‌కు తెలిపినట్లు రమేష్ వెల్లడించారు. జనసేన బలోపేతానికి కృషి చేయాలని, రానున్న రోజుల్లో పార్టీకి మంచి ఆదరణ ఉంటుందని, ప్రజలు పార్టీని ఆదరిస్తున్నారని పవన్ కళ్యాణ్ సూచించినట్లు రమేష్ తెలిపారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన జనసేన నియోజకవర్గం నేత రమేష్

ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేయాలి

సిఐటియు జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు

ఆశా కార్యకర్తలతో సిఐటియు నేతలు శ్రీనివాసరావు, బ్రహ్మాజీ

ప్రజాశక్తి-మునగపాక రూరల్

క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య సమస్యలపై అహర్నిశలు కృషి చేస్తున్న ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేసి, మెరుగైన వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. ఎపి వాలంటరీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (ఆశా) మండల మహాసభ సోమవారం మునగపాకలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పని భారం పెంచడంతో ఆశాలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, పర్మినెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మండల కమిటీ ఎన్నిక

అనంతరం ఆశా యూనియన్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా పార్వతి, కుమారి, కమిటీ సభ్యులుగా ఎం.గంగాభవాని, ఉమాదేవి రూప, శ్రావణి, సిహెచ్ నాగలక్ష్మి, పి.లక్ష్మి, నాగమణి, కుమారి, మహాలక్ష్మి సరోజినీ, భవాని, వరలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మునగపాక, చూచుకొండ పిహెచ్‌సిల పరిధిలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగ పింఛనుదారుల్లో టెన్షన్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని వికలాంగుల పింఛనుదారుల్లో టెన్షన్ నెలకొంది. వారం రోజులుగా మండలంలోని వికలాంగుల పింఛన్ల వివరాలను గ్రామ సచివాలయాల ద్వారా అధికారులు పరిశీలన చేస్తున్నారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లో 1306 వికలాంగుల పింఛన్లు ఉన్నాయి. వీరి సదరం సర్టిఫికెట్లను లబ్ధిదారుల వారీగా మండలంలో మూడు టీములుగా అధికారులు పరిశీలించారు. పది, పదిహేను సంవత్సరాల నుండి పింఛను పొందుతున్న వారి వివరాలు కూడా పరిశీలన చేస్తున్నారు. కొంతమంది సదరం సర్టిఫికెట్లు పోయాయి. వారి వైకల్యాలను అధికారులు ప్రశ్నిస్తుండడంతో ప్రధానంగా గుడ్డి, మూగ, చెవిటి తదితర లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు లబ్ధిదారులను సచివాలయాల్లో పరిశీలన అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి రావాలని ఆదేశించడంతో పింఛన్ తొలగిస్తారన్న ఆందోళన వారిలో నెలకొంది. అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి సోమవారం వచ్చారు. వైకల్యాన్ని నిర్ధారించే సదరం సర్టిఫికెట్లు వైద్యాధికారుల బృందం మంజూరు చేస్తుంది. కానీ అధికారుల తికమక ప్రశ్నలతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వికలాంగ పెన్షన్లను తొలగించడానికి ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతుందని వికలాంగ పింఛనుదారులు ఆందోళన చెందుతున్నారు.

హింసను అరికట్టడంలో భాగస్వామ్యం

ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎస్.అరుణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ హింస వ్యతిరేక దినోత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'హింస లేని సమాజాన్ని నిర్మిద్దాం- సమానత్వ సాధనకై పయనిద్దాం' అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై హింస అత్యాచారాలు పెరగడానికి మద్యం, మత్తు పదార్థాలు ప్రధాన కారణమని, వీటిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. సమానత్వ స్థాయిని పెంచే అంశాలను పాఠ్యాంశాలలో పొందుపరచాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అశ్లీల అంశాలను నిరోధించాలని, సైబర్ నేరాలను అరికట్టాలని కోరారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి సుభాషిణి మాట్లాడుతూ మహిళలను కించపర్చిన రాందేవ్ బాబా, గరికపాటి తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలో ఖాళీగా ఉన్న ఐదు వాలంటీర్ పోస్టులకు సోమవారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జివి.రమణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు రైవాడ నుండి ఇద్దరు, కొత్తపెంట నుండి ఒకరు మొత్తం ముగ్గురు హాజరయ్యారు.

ప్రజలను చైతన్యం చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలను చైతన్యవంతులు చేయాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అచ్చుతాపురం ఎస్‌కెఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎలమంచిలి నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి టిడిపి విధానాలను తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, ప్రజల వద్దకు వెళ్లి ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ధూళి రంగనాయకులు, వసంతవాడ దినుబాబు, గొర్లి నానాజీ, నాలుగు మండలాల బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు పప్పల తదితరులు

దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

పేదలకు సాయం

ప్రజాశక్తి-కశింకోట : మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకల్లో నాలుగవ రోజు సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కలగా సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, కలగా శివానందం, తాకాసి కృష్ణ, ఉల్లింగల రమేష్, గొల్లవిల్లి ప్రవీణ్, జెర్రిపోతుల నూకునాయుడు, గొంతిని గంగాధర్ పాల్గొన్నారు.

దేవరాపల్లి అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి కృషి

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి గ్రామ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవ చూపిస్తూ కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసినట్లు ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు అన్నారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేవరాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి రైవాడ రోడ్డు, ప్రభుత్వ కార్యాలయాల రోడ్డు విస్తరణ, దేవరాపల్లి-ఆనందపురం రోడ్డు పనులు పున: ప్రారంభం, దేవరాపల్లి గ్రామ శివారు కల్లాలకు లింక్ రోడ్ల వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. మౌలికవసతుల కల్పన, పనుల నాణ్యతలో డిప్యూటీ సీఎం బూడి దూరదృష్టి అభినందనీయమన్నారు.

నేడు షష్టి మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయితీ శివారు లగుడువారి ఇల్లులు దగ్గర శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం షష్టి పూజ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులు రూ.250 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9010382322, 9963154983 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మునగపాక శ్మశాన వాటికలో జరుగుతున్న పనులను సర్పంచ్ దిమ్మల అప్పారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వివిధ కులాల వారు వారి, వారి ఆచారాలను బట్టి దహన సంస్కారాలు జరపడం జరుగుతుందని, వారు వినియోగించే పలు సామగ్రిని భద్రపర్చేందుకు షెడ్లు, రహదారుల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు.

1076 మంది రైతులకు సున్నా వడ్డీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలో 1076 మంది రైతులకు సున్నా వడ్డీ కింద వారి డబ్బులు జమ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎల్వి కాంతమ్మ తెలిపారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 ఖరీఫ్ కాలం సెప్టెంబర్, అక్టోబర్ నెలలో వర్షాల కారణంగా నీట మునిగిన వరి పంటకు ఎ.కొత్తపల్లి, చిననందిపల్లి గ్రామాలకు చెందిన 46 మంది రైతులకు రూ.94,300 పరిహారం వారి ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. చేతితో నడిపే వరి కోత యంత్రానికి రెండు లీటర్లు పెట్రోల్ వేస్తే ఒక ఎకరం రెండు గంటలు వ్యవధిలో పంటను కోయడం జరుగుతుందన్నారు. దీని వల్ల రైతులకు రూ.1500 నుండి రూ.2000 వరకు ఆదా అవుతుందన్నారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.కిరణ్ కుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

యంత్రంతో వరి పంటను కోయడాన్ని పరిశీలిస్తున్న కాంతమ్మ

పూలే ఆశయ సాధనకు కృషి

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే 132వ వర్ధంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం పేరుతో తరతరాలుగా అణచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాలకు చదువు ప్రాముఖ్యతను వివరించిన ఆశాజ్యోతి పూలే అని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ వెంకటరమణ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలోనూ, స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో అఖిలభారత బిసి ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు ఆధ్వర్యంలోనూ, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జొన్నకోట చెన్నమూర్తి ఆధ్వర్యంలోనూ పూలే వర్ధంతి నిర్వహించారు. సిపిఐ కార్యాలయంలో సామాజిక హక్కుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు పూలే చిత్ర పటానికి పూలమాల శ్రద్ధాంజలి ఘటించారు.

దేవరాపల్లి : మండలంలోని తారువలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కార్యాలయంలో జెడ్‌పి స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్పర్సన్ ఈర్లె అనురాధ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు ఎంపిపిలు కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, వేమవరపు రామ ధర్మజ, కురచా జయమ్మ నారాయణమూర్తి, రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీలు కర్రి సత్యం, కిముడు రమణమ్మ, వైసిపి నాయకులు బూరె బాబురావు, గొల్లవిల్లి రాజబాబు, వైస్ ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి సత్య వెంకటరమణ, ఉగ్రుకల గంగాభవాని అప్పారావు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్, సర్పంచులు చల్లా లక్ష్మీ నాయుడు, రొంగలి వెంకటరావు, గొర్రెపోటు సుధారాణి సారథి, నాగిరెడ్డి సటారీనాయుడు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి జ్యోతిబాపూలే అని శాసనసభ్యులు గొల్ల బాబురావు కొనియాడారు. జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా కోరుప్రోలు లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం దేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి జ్యోతిబాపూలే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై టిడిపి ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగు రైతు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు టిడిపి ఆధ్వర్యాన రైతాంగ సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు బిగించి రైతాంగం నుంచి కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని, అదే పరిస్థితి అనకాపల్లి జిల్లాకు రానుందని, తక్షణమే ఈ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పంటకు గిట్టుబాటు ధర లేదని, పురుగుల మందులు ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని, దీంతో రైతు ఆర్థికంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.300 కోట్లు విలువ చేసే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని దివాళా సంస్థగా ప్రకటించి కాజేసేందుకు రాష్ట్ర మంత్రి అమర్నాథ్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముసలి నాయుడు, శ్రీనివాసరావు, పీరావు కొండలరావు, కోడూరు సాంబశివరావు, కలింగ సన్యాసినాయుడు, కుచ్చు సత్తిబాబు, లెక్కల అవతార మూర్తి, అక్కిరెడ్డి రమణబాబు, గొంతిన నూకరాజు, గోకివాడ లోవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి రైతు నేత రమణమూర్తి హౌస్ అరెస్టు

కశింకోట : రైతు సమస్యలపై కలెక్టర్ వద్ద ధర్నాకు వెళ్తున్న తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తిని సోమవారం మండలంలోని పరవాడపాలెంలో ఆయన స్వగృహంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న వరలక్ష్మి దంపతులు

విధుల్లోకి తీసుకోవాలని పాఠశాల ఆయా నిరసన

ప్రజాశక్తి- చోడవరం : జన్నవరం హైస్కూల్లో ఆయాగా ఆరేళ్ల నుండి పని చేస్తున్న తనను తొలగించి స్కూల్ కమిటీ చైర్మన్ తన భార్యను నియమించుకున్నారని, తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఆవుపాటి వరలక్ష్మి, ఆమె భర్త సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలు వరలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీకి చెందిన స్కూల్ కమిటీ చైర్మన్ తనను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, తనపై చేయి కూడా చేసుకున్నారని వాపోయింది. గ్రామస్తులందరూ తనకు మద్దతుగా నిలుస్తున్నా, వైసిపి అండ చూసుకొని తనను తొలగించి, ఆయన భార్యను విధుల్లోకి తీర్చుకున్నారని తెలిపింది. దీనిపై మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమ భార్యాభర్తలకు జీవనోపాధి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బాధితురాలకు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గునూరు వరలక్ష్మి సంఘీభావం తెలిపారు. గ్రామాల్లో బతుకుతెరువు కోసం పనిచేసే కార్మికుల పట్ల వైసిపి నాయకుల దాడులు ఎక్కువయ్యాయని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కలుగ చేసుకుని బాధితురాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

హెరిటేజ్ ఆధ్వర్యాన పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - కశింకోట : మండలం విస్సన్నపేటలో హెరిటేజ్ డెయిరీ పాడి రైతుల పశువులకు ఆ డెయిరీ ఆధ్వర్యాన సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్య అధికారి బస్విన్ తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు మాట్లాడుతూ పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ రూ.50కు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆడ దూడ పుట్టేందుకు రూ.500కే కృత్రిమ గర్భధారణ చేస్తున్నట్లు తెలిపారు. డెయిరీ రీజనల్ మేనేజర్ పి.నాగ అప్పారావు, ఏరియా మేనేజర్ జి.గోవిందరావు, మేనేజర్ కూండ్రపు శేషు, పాల సంఘం అధ్యక్షుడు జి వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలో లంకెలపాలెంలో శ్రీకలాష్ ఎడ్యు ప్రైవేటు లిమిటెడ్ ఫార్మింగ్ జిల్లా కో-ఆర్డినేటర్ రవికిరణ్ ఆధ్వర్యంలో ఐటిసి టెక్నిక్స్ ఫార్మింగ్, ఎక్స్‌పోర్ట్ మార్కెటింగ్ అనే అంశంపై రైతులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఐటిసి టెక్నిక్స్ ఉపయోగించి అధిక ఉత్పత్తి ఎలా సాధించాలి, పండించిన పంటను మధ్యవర్తుల సహాయం లేకుండా ఎలా ఎక్స్‌పోర్ట్ మార్కెటింగ్ చేయాలని అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుప్మ, నిస్ట్ కాలేజ్ డైరెక్టర్ ఇజ్రాయిల్, రైతులు పాల్గొన్నారు.

స్పందనకు 240 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 240 దరఖాస్తులు వచ్చాయి. వీటిని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, జెసి కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీల పై దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

దళితుల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని...

దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి పెద్దాడ లోవరాజు మాట్లాడుతూ ఎస్సీ సంక్షేమ పథకాలను మూడేళ్లుగా నిలుపుదల చేయడం బాధాకరమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు, భూమి కొనుగోలు పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం, కులాంతర వివాహ ప్రోత్సాహకాలు, బుక్ బ్యాంకు స్కీము, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన వంటివి అమలు కావడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు ఎర్రంశెట్టి పాపారావు, వడ్డాది అప్పలనాయుడు, పెద్దాడ కృష్ణ, కొండ్రు అప్పారావు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని..

కె.కోటపాడు : ఎన్నో ఏళ్ల నుండి మండలంలోని మర్రివలస, సూదివలస, దాలివలస, ఆర్లె, కింతాడ, పిండ్రంగి తదితర గ్రామాల్లో పేదలు బంజరు భూముల్లో జీడి, మామిడి తోటలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ కె.కోటపాడు మండల నాయకులు సోమవారం కలెక్టరేట్ స్పందనలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ వీరికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకపోవడంతో వివిధ రకాల రాయితీలు, పథకాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఐ నాయకులు గొర్లె దేముడు బాబు, వేచలపు కాసుబాబు, రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము, పొంతపల్లి రామారావు, సీమసురు సూర్యనారాయణ, కన్నూరు అప్పారావు ఉన్నారు.

104 సేవలు కొనసాగించాలని..

మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో 104 సేవలు కొనసాగించాలని గ్రామ సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు సోమవారం స్పందనలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి కు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా సచివాలయాల్లో మాత్రమే సేవలు అందుతున్నాయని, మూలపేట పంచాయతీకి 104 సేవలు నిలిపివేసిన కారణంగా రోగులు, వృద్ధులు సమీప తోటాడ సచివాలయానికి వెళ్లి సేవలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

హెటిరో పైపులైన్ తొలగించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో కంపెనీ కొత్తగా వేసిన పైపులైన్ పూర్తిగా తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. సోమవారం అనకాపల్లిలో జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని అన్నారు. కంపెనీ నుండి వెలువడే వాయు కాలుష్యంతో అనేకమంది రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో 2021 డిసెంబర్ 1 నుండి శాంతియుతంగా ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. నేటి వరకు సమస్యను పరిష్కరించక పోవడంతో న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. చెన్నైలో జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేశామని తెలిపారు. కంపెనీ కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాలని అప్పలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి బాపూజీ, పిడిమి వీరన్న, మైలపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని చూపుతున్న సిపిఎం నేత అప్పలరాజు



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఇంటి పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ ఎంపిడిఓ పి.వెంకటనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నుల వసూలు, పారిశుద్ధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, గ్రామ కంఠాల సర్వే, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ప్రజలకు అవగాహన కల్పించి పారిశుద్ధ్య నిర్మూలన గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. గ్రామ కంఠాల సర్వేను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పక్కగా అమలు చేసి పంచాయతీలకు సంపద సృష్టించాలని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేతనాలకు పారిశుధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు మనబాల రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో కలిసి ఇంచార్జ్ ఎంపిడిఓ వెంకట నారాయణకు వినతిపత్రం అందజేశారు.పారిశుధ్య కార్మికులకు సుమారుగా రెండు సంవత్సరాల నుండి జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఏళ్ల తరబడి జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రతినెల జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి అందుబాటులో ఉన్న ఎన్.నర్సాపురం, దోసలపాడు, గుల్లిపాడు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఐనవెల్లి లోవరాజు, నంబారు గోవిందు, ఏడిద చిన అప్పన్న, పక్కుర్తి సన్యాసిరావు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న రాజేష్, పారిశుధ్య కార్మికులు

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చందనాడలో పంచాయతీకి సంబంధించిన స్థలంలో అక్రమ కట్టడాలకు పంచాయతీ కార్యదర్శి ఎన్‌ఓసి ఎలా ఇచ్చారని ఇన్చార్జి ఎంపిడిఓ వెంకటనారాయణకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ భర్త, వైసిపి నాయకులు తళ్ల భార్గవ్ ఫిర్యాదు చేశారు. సచివాలయం ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలంలో పాల సేకరణ సెంటర్ భవన నిర్మాణానికి కేటాయించడం జరిగిందన్నారు. ఆ స్థలంలో అక్రమంగా రేకుల షెడ్డు నిర్మించారని, దానికి విద్యుత్ మీటర్ కనెక్షన్ ఇవ్వడానికి పంచాయతీకి అభ్యంతరం లేదంటూ పంచాయతీ కార్యదర్శి ఎన్‌ఓసి సర్టిఫికెట్ ఇచ్చారని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వెంటనే ఎన్‌ఓసిని రద్దు చేయాలన్నారు.

ఫిర్యాదు చేస్తున్న భార్గవ్

'ఉపాధి హామీ'పై గ్రామసభ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వలస బాట పట్టకూడదన్న ఉద్దేశంతో గ్రామంలోనే పని కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ మాట్లాడుతూ గ్రామంలో చెరువులు, పంట కాలువలు, జీడి తోటల్లో కందకాలు, మట్టి రోడ్డు, పండ్ల తోటల పెంపకం పనులను గుర్తించి ఎస్టిమేట్లు వేసి మంజూరుకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్, స్కూల్ కమిటీ చైర్మన్ పి.నాయుడు బాబు పాల్గొన్నారు.

హాజరైన గ్రామస్తులు

నాడు - నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని రాయవరం, కోనవానిపాలెం గ్రామాల్లో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు నాడు నేడు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.83లక్షల వ్యయంతో కొత్త భవనాల నిర్మాణానికి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. రాయవరం గ్రామంలో ప్రభుత్వ గర్ల్స్ హైస్కూలుకు రూ. 43 లక్షలు, కోనవానిపాలెం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయవరం స్కూల్ చైర్మన్ ఏసుబాబు, కోనవానిపాలెం స్కూల్ చైర్మన్ బాబ్జి, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, సింహాద్రి, మూర్తి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

గ్రామ స్థాయిలో బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:గ్రామస్థాయి నుండి జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ వీర రాజాన సూర్యచంద్ర కోరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాల జనసేన అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, గ్రామస్థాయిలో బూత్ కమిటీలు వేసి తద్వారా గ్రామ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి జనసైనికులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, ప్రధాన కార్యదర్శి చిరంజీవి శ్రీను, కొప్పాక కళ్యాణి, గొలుగొండ మండల సీనియర్ నాయకులు రేగుబల్ల శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యచంద్ర

విభిన్న ప్రతిభావంతుల పింఛన్లపై సమగ్ర సర్వే

ప్రజాశక్తి-కొత్తకోట:ప్రభుత్వం ఆదేశాల మేరకు వికలాంగుల పింఛన్లపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు పింఛన్ దారులు వదంతులు నమ్మవద్దని రావికమతం ఎంపిడిఓ వెంకన్నబాబు చెప్పారు. సోమవారం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో ప్రస్తుతం వికలాంగుల పింఛన్ పొందుతున్న పలువురు లబ్ధిదారుల వివరాలను ఆయన ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు.ఈ సందర్భంగా పింఛన్ దారుని ఐడితో పాటు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, సదరన్ సర్టిఫికెట్ తదితర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ వెంకన్నబాబు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా వికలాంగుల పింఛన్లపై సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నామన్నారు. మండలంలో రెండు బృందాలుగా విభజించి ఈఓపిఆర్‌డి, సీనియర్ రికార్డు అసిస్టెంట్ నేతృత్వంలో సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ పేర్కొన్నారు. మేజర్ పంచాయతీ కొత్తకోటలో సుమారు 228 వికలాంగు పింఛన్లు ఉన్నాయని, నాలుగు రోజుల్లో పరిశీలన పూర్తి చేస్తామన్నారు. సర్వేపై వికలాంగ పింఛన్ లబ్ధిదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఎంపిడిఓ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, పంచాయతీ ఈఓ కృష్ణమోహన్, సచివాలయ సిబ్బంది ప్రణతి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఎంపిడిఓ

నిధుల కేటాయింపునకు వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: చెట్టుపల్లిలోని దళితవాడకు డ్రైనేజీలు, కల్వర్టులకు నిధులు కేటాయించాలని ఆర్డీవో జయరాంకు రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు వినతిపత్రం అందించారు. ఆర్డీఓ కార్యాలయంలో స్పందనలో పాపారావుతో పాటు చెట్టుపల్లి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. చెట్టుపల్లి గ్రామ దళితవాడలో డ్రైనేజీలు లేక మురుగునీరు నిల్వ ఉండి. దోమలకు నిలయాలుగా మారాయని తెలిపారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు దోమ కాటుతో రోగాలు బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులను అర్థం చేసుకొని దళితవాడ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆర్డీవోను కోరారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వార్డ్ మెంబర్ ఎర్రం శెట్టి పెదరాజు, వార్డు మెంబర్ ఎల్లమ్మ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న పాపారావు

వైసిపి పాలనకు చరమ గీతం పాడాలి

మాట్లాడుతున్న టిడిపి నేత పాత్రుడు

ప్రజాశక్తి-మాకవరపాలెం: వైసీపీ పాలనకు చరమ గీతం పాడాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆర్ వై పాత్రుడు పిలుపునిచ్చాడు. సోమవారం తామరం ప్రభాకర్ రాజు ఇంటి వద్ద టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన జగన్ పీడను వదిలించేందుకు చే పెట్టే ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులంతా విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో చేస్తున్న భూ సర్వేతో రైతులు కుమ్ములాటల పెరిగాయన్నారు. విచారణ పేరుతో వికలాంగులను వేధిస్తున్నారని తెలిపారు. చేయూత పథకం కార్యక్రమంలో ప్రభుత్వానికి ఓటు వేయాలని అధికారులు చెప్పడం దుర్మార్గపు చర్యని అన్నారు ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు. కేతిరెడ్డి చిరంజీవి, మండల యూత్ అధ్యక్షుడు పాసూపు సురేష్, నియోజకవర్గం సోషల్ మీడియా అధ్యక్షుడు కోసూరు శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకష్ణ మాదిగ

ప్రజాశక్తి -పాయకరావుపేట: బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కోరారు. పాయకరావుపేట మండలంలోని పాల్తేరు, సత్యవరంలో భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ ఐదు దశాబ్దాల పాటు ఈ దేశానికి సేవలు అందించారన్నారు. కార్మిక శాఖలో ఎన్నో చట్టాలు తీసుకొచ్చిన ఘనత బాబు జగ్జీవన్ రామ్‌కు దక్కుతుందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ, పూలే, జగ్జీవన్ రావ్ వంటి మహానీయులు మన దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, మండల విద్యాశాఖ అధికారి కేఎన్ గాంధీ, రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి లక్ష్మణరావు, వాల్తేరు గ్రామ పెద్దలు దేవర రాజబాబు, యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తుమ్మలపల్లి కుమార్, ఖండింపల్లి నాగేశ్వరరావు, నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో ప్రభవ్ ప్రతిభ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల నగరంలో రోలర్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రోలర్ ఆల్పిన్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించిన ఎం.ఎన్.ఎస్ .వై.ప్రభవ్‌ను లక్ష్మీనరసింహ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం దీనదయాల్‌పురం లో పలువురు అభినందించారు. వచ్చేనెల 11నుంచి 21వరకు బెంగళూరులో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షిస్తూ ప్రభవ్‌ను 13వ వార్డు వైసిపి అధ్యక్షుడు కెల్ల సత్యనారాయణ, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రామన్న పాత్రుడు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.రవికుమార్, పి.ఆదిమూర్తి, కార్యదర్శి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభినందిస్తున్న నేతలు

క్రికెట్ విజేత హెచ్‌పిసిఎల్ విశాఖ జట్టు

ప్రజాశక్తి - ములగాడ : హెచ్‌పిసిఎల్ ఆల్ ఇండియా ఇంటర్ యూనిట్ క్రికెట్ టోర్నీలో కెప్టెన్ పి.వెంకటపతి రాజు నేతృత్వంలోని విశాఖ రిఫైనరీ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ముంబైలో ఈనెల 24 నుంచి 26వరకు నిర్వహించిన టోర్నీలో 12జట్లు పాల్గొనగా, ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన విశాఖ రిఫైనరీ జట్టు, ఫైనల్‌లో నార్త్‌జోన్ జట్టుపై 31పరుగుల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేత విశాఖ రిఫైనరీ జట్టు ఫైనాన్స్, హెచ్‌ఆర్ డైరెక్టర్ రజనీష్ నారంగ్ నుంచి ట్రోఫీని అందుకున్నారు. విజేత విశాఖ జట్టును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇన్చార్జ్ వి.రతన్‌రాజ్ అభినందించారు. టీమ్ మేనేజర్ మిస్టర్ జాన్ చెరియన్, మేనేజర్ హెచ్‌ఆర్, ఛాంపియన్ టీమ్ సభ్యులు ఎస్. రాజశేఖర్, బిఎస్ రాఘవేంద్ర, ఇఆర్‌ఎమ్ రెడ్డి, వివేక్ సింగ్ (ఉత్తమ బ్యాట్స్‌మెన్), పి మోహన్ కుమార్ (ఉత్తమ బౌలర్ మరియు మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్), అభిషేక్ ఎస్. నిరంజన్, ఎం.కే చౌహాన్, ఎన్. భద్ర, పీ .వి సంజయ్ కుమార్, కే. సుధీర్ రాజ్, ఎం.ఎఫ్ హఫ్నాస్, వై. హేమంత్, హరి, పి.వెంకట కుమార్‌లను హెచ్‌పిసిఎల్ సిజిఎం (హెచ్‌ఆర్) వి.నగేష్ అభినందించారు.

విజేత జట్టు సభ్యులు

జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తి చేయాలి

▶▶ప్రతి శనివారం హౌసింగ్ డే ▶▶రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో జగనన్న హౌసింగ్ కాలనీలలో గృహ నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు', జగనన్న హౌసింగ్ కాలనీల గృహ నిర్మాణ ప్రగతిపై ప్రజాప్రతినిధులుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఒక లక్షా 34 వేల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పురోగతిని జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసులు ఇతర సమస్యలను అధిగమించి జగనన్న కాలనీల నిర్మాణంలో పురోగతిని సాధిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క ఇంటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారునికి అందజేయడం అధికారుల బాధ్యత అన్నారు. అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, బిల్లులు అప్లోడ్ చేయని విషయంలో వెంటనే స్పందించాలని లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల గృహ నిర్మాణాలు పూర్తయ్యేవరకు ప్రతి శనివారం హౌసింగ్ డేగా పాటించాలని అన్నారు. పై స్థాయి నుంచి కింద స్థాయి వరకు అధికారులందరూ ప్రతి శనివారం జగనన్న లే అవుట్లను పరిశీలించి ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించాలన్నారు. గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జెట్కన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ జిల్లాలోనే అత్యధికంగా ఒక లక్షా 34 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. సమీక్షా సమావేశంలో జివిఎంసి కమిషనర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.శివ ప్రసాద్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, శాసన మండలి సభ్యులు వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఆర్డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

వేములపూడి పిహెచ్‌సిలో శిశువు మృతి

వైద్యురాలు సకాలంలో రాకపోవడమే కారణం : బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యంతో గర్భస్థ శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యులు అందుబాటులో లేక పోవడమే పసికందు మృతికి కారణం అని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ సందర్భంగా భర్త శివ విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలోని ఎరకంపేట గ్రామానికి చెందిన తన భార్య మాకిరెడ్డి సరస్వతికి పురిటి నొప్పులు రావడంతో వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆదివారం రాత్రి 12 గంటలకు ఆసుపత్రికి తీసుకు వచ్చానని తెలిపాడు. అక్కడి సిబ్బంది ప్రథమచికిత్స అందించి, తల్లీ బిడ్డ క్షేమంగానే ఉన్నారన్నారన్నారన్నారు. అప్పటికి డెలివరీ టైం దగ్గర పడడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని అందుబాటులో లేక పోవడం, సిబ్బందికి డెలివరీ పై అవగాహన లేకపోవడం తో అంతంతమాత్రంగానే వైద్యం అందించారని తెలిపాడు. సుమారు పది గంటలు తల్లి గర్భంలో శిశువు మృత్యువుతో పోరాడి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వైద్యురాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షించగా అప్పటికే శిశువు మృతి చెందిందని తెలిపారని చెప్పాడు. మెడికల్ ఆఫీసర్లపై తగు చర్యలు తీసుకుని, ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకుండా చూడాలని భర్త కోరాడు.

మాట్లాడుతున్న బంధువులు

పాడి రైతులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-కోటవురట్ల: రైతు భరోసా కేంద్రాల వద్ద పశు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలని పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రిప్పడు సూచించారు. సోమవారం పశు వైద్యశాల వద్ద కోటవురట్ల, మాకవరపాలెం మండలాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పశుగ్రాసం విత్తనాల సరఫరా, పాడి పశువులకు అందిస్తున్న ఇన్సూరెన్స్, మందుల కొరత తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి పడాల్, పాములవాక వైద్యాధికారిణి హరిప్రియ, ఇరు మండలాలకు చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింహాద్రిప్పడు

వాలంటీర్ల నియామకం

ప్రజాశక్తి-కోటవురట్ల:పాములవాక గ్రామానికి సంబంధించి సోమవారం వాలంటీర్లను నియమించినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైన వాలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు.విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పనిచేస్తూ మెరుగైన సేవలు అందించాలని ఎంపిడిఒ సూచించారు.

నియామక పత్రాన్ని ఇస్తున్న ఎంపిడిఒ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

అన్ని తరగతుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

ప్రజాశక్తి-నాతవరం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో శృంగారం గ్రామంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పర్యటించారు. నెల రోజుల కిందట జరిగిన ప్రమాదంలో కాలి గాయం కావడంతో నడవలేని స్థితిలో ఉన్న ఎమ్మెల్యే వీల్ చైర్‌లోనే ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అన్ని వర్గాల వారిని అన్ని విధాలా ఆదుకోవడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ సునీల్, జడ్పిటిసి అప్పలనరస, పార్టీ అధ్యక్షులు పైల పోతురాజు, మండల మహిళా అధ్యక్షురాలు కామిరెడ్డి వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచు ఎర్రయ్యమ్మ, మాజీ సర్పంచ్.వి.శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

ఎంపిడిఒ వెంకన్న బాబు

ప్రజాశక్తి - కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోటలో మార్కెట్ యార్డును మోడల్ యార్డ్‌గా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రావికమతం ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక మార్కెట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్ యార్డుకు కావాల్సిన వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదంటూ పలువురు గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చారని, దీనిపై తొందరలోనే ఒక ప్రణాళిక తయారు చేసి మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఇప్పటికే దుకాణ సముదాయాల నిర్మాణాలకు నాబార్డ్ నిధుల నుంచి రూ.15లక్షలు మంజూరు కాగా మ్యాచింగ్ గ్రాండ్‌గా పంచాయతీ నుంచి మరో రూ.3 లక్షలు నిధులు సమకూరుస్తున్నట్టు తెలిపారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఆక్రమణలు కూడా ఆటంకంగా మారాయని వాటిని తొలగించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కొత్తకోటతో పాటు మరో 20 గ్రామాల ప్రజలకు ఆరోగ్యవంతమైన సరుకులు అందించే విధంగా మోడల్ మార్కెట్ యార్డ్‌ను నిర్మిస్తామన్నారు.ప్రస్తుతం మార్కెట్ యార్డులో ప్రమాదకరంగా శిధిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు లేదా మరమ్మతులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవా ఎంపీడీవోను కోరారు. పంచాయతీ తీర్మానం చేసి తమకు అందజేయాలని ఎంపీడీవో సూచించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో కృష్ణమోహన్, ఎంపీటీసీ పూడి దేవ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకన్నబాబు

కొండలరావు ప్రతిభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం సిఐడి విభాగంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ పలు దేహదారుఢ్య పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరుస్తున్న కొమ్ముజు కొండలరావు ఇటీవల ఇచ్ఛాపురంలో జరిగిన దేహదారుఢ్య పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు సోమవారం అభినందించారు. కొండలరావు సిఐడి విభాగానికి మంచి పేరు తీసుకు వస్తున్నారని కొనియాడారు. అభినందించిన వారిలో సిఐడి విశాఖ నగర ఆర్ఒ చక్రవర్తి, ఎడిఎస్‌పి వర్మ, సిఐడి అడ్మిన్ రమేష్, సత్యనారాయణ, భగవాన్, తదితరులు ఉన్నారు.

అవార్డుతో కొండలరావు